క్లుప్తంగా

టీడీపీ, జనసేనలను నమ్మకండి

గడపగడపలో ద్వారంపూడి



అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అధికారం కోసం తప్పుడు వాగ్దానాలు చేసే టీడీపీ, జనసేనలను నమ్మొద్దని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచించారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా స్థానిక 19వ డివిజన్‌లో బుధవారం ఆయన అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలు పట్టించుకోని టీడీపీ మళ్లీ ప్రజల్లోకి వస్తోందని, అటువంటి నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే మంచి అవకాశాన్ని సీఎం జగన్ ఇచ్చారని, ఇది తమకెంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, స్థానిక నాయకులు సిద్ధాంతపు రాజు, బంగారయ్య తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

23న మండల సమావేశం

కాకినాడ రూరల్: మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 23న జరగనుందని ఎంపీడీఓ కర్రే స్వప్న తెలిపారు. రమణయ్యపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో 23న మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని బుధవారం తెలిపారు.

బ్లడ్‌బ్యాంకులో లిఫ్ట్ ఏర్పాటు

బోట్‌క్లబ్: రోటరీ బ్లడ్‌బ్యాంక్‌లో రోగుల సౌకర్యార్థం నిర్మించనున్న లిఫ్ట్ నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. రోటరీ మాజీ గవర్నర్లు ఎల్.సత్యనారాయణన్, ఎస్‌వీఎస్‌రావు పనులు ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షులు జీవి కృష్ణప్రకాష్ మాట్లాడుతూ విజన్ ప్రాజెక్ట్స్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత నిట్టల వెంకటరామారావు సీఎస్ఆర్ నిధులు రూ.6 లక్షలు అందించారని, మరో రెండు లక్షలు బ్లడ్‌బ్యాంక్ నిధులతో లిఫ్ట్ నిర్మిస్తున్నామన్నారు.

వేద విద్యార్థులకు వితరణ

బోట్‌క్లబ్: దేశ సంస్కృతి, సాంప్రదాయాల్లో భాగమైన వేదాలను భావి తరాలకు అందించేది వేద విద్యార్థులేనని రోటరీ యూత్ సర్వీసెస్ చైర్మన్ టీవీ రమణరావు అన్నారు. రోటరీక్లబ్ కాకినాడ యువజన మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక శ్రీపీఠంలో వేద విద్యార్థులకు పంచె, కలశం, ఆసనాలను అందించారు. క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద, కార్యదర్శి కోనాడ ప్రకాశరావు, శ్రీపీఠం మేనేజర్ రవివర్మ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు..

కాకినాడ కల్చరల్: స్థానిక విముక్తికాలనీలోని కుష్ఠువ్యాధిగ్రస్తులు 350 మందికి జీసస్ సాల్వేషన్ సోషల్ వర్క్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు పి.హోసక్ మందులు, రబ్బర్ చెప్పులు, బియ్యం, నిత్యావసర వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి ఎలిజబెత్, జాకబ్ సుందర్, ముత్తాబత్తుల విశాల్‌ప్రేమ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకే డైరెక్టర్ వెంకటరెడ్డికి సత్కారం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరెడ్డిని బుధవారం సత్కరించారు. అత్యధికంగా స్వచ్ఛంద శిబిరాల ద్వారా రక్తం సేకరించడంలో కీలక పాత్ర పోషించిన ఆయనను రెడ్‌క్రాస్ భవన్‌లో బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వైడీ రామారావు అధ్యక్షతన వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు సత్కరించారు. అనుబంధ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా శిబిరాలు నిర్వహించి రక్త నిల్వలు సేకరించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఈఏపీ సెట్‌లో కరప విద్యార్థుల ప్రతిభ



వడ్డి రోహన్ శివతేజ (263)



చింతా లక్ష్మీసుప్రజ (159)



నంబూరి వెంకటేష్ (166)

కరప: ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఈఏపీసెట్ ఫలితాల్లో మండల విద్యార్థులు ప్రతిభ చూపారు. అగ్రికల్చర్, ఫార్మసీలో వేళంగి పెదకొత్తూరుకు చెందిన చింతా లక్ష్మీసుప్రజ 159వ ర్యాంకు, కరప పెద్దవీధికి చెందిన నంబూరి వెంకటేష్ 166వ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్, ఫార్మసీలో కరప కొత్తపేట వీధికి చెందిన వడ్డి రోహన్ శివతేజ 263వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. రోహన్ గతంలో పాలిటెక్నిక్‌లో రాష్ట్రస్థాయిలో 19వ ర్యాంక్, జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 952వ ర్యాంక్ సాధించాడు.

అడుగులన్నీ సర్కారు బడికే..

- కళకళలాడుతున్న పాఠశాలలు
- చురుగ్గా విద్యార్థుల అడ్మిషన్లు
- సీట్ల కోసం పెరిగిన డిమాండ్



కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లకు పోటెత్తిన విద్యార్థులు, తల్లిదండ్రులు

కాకినాడ రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు గతంలో దుంపల బడులన్న పేరుండేది. గుల్లబారిన గచ్చులు, పెచ్చులూడిన శ్లాబులు, బెల్లులు ఊడిన బ్లాక్‌బోర్డులు ఇలా ఎన్నో లక్షణాలు ఆ పాఠశాలలకు ఉండేవి. కచ్చితంగా పేద విద్యార్థులే వాటిలో చదుకుంటారేమో అనిపించేలా చిరిగిపోయిన పుస్తకాలు, కుట్లూడిన యూనిఫాం. గత పాలకుల ఘన చరిత్రలివి. నేటి పరిస్థితి అందుకు విభిన్నం. చూడగానే చదువుకోవాలనిపించేలా పాఠశాల భవనాలు, క్రీడా మైదానాలు, చక్కని వసతులు, రుచికరమైన మెనూతో మధ్యాహ్న భోజనం, వ్యక్తిగత శ్రద్ధతో ఉపాధ్యాయుల బోధన.. ఇంతకన్నా ఇంకేం కావాలి విద్యార్థులకైనా, తల్లిదండ్రులకైనా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలు దుంపల బడులను దయనీయ స్థాయి నుంచి ‘మేం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులం’ అని విద్యార్థులు గర్వంగా చెప్పుకొనే స్థాయికి తీసుకువెళ్లారు. వేసవి సెలవులు ముగిసి 12వ తేదీ నుంచి పాఠశాలలు తెరుచుకున్నాయి. ఎండల తీవ్రతతో ప్రస్తుతానికి ఒంటిపూటకే తరగతులను పరిమితం చేశారు. గడచిన ఏడాది ఉత్తీర్ణతా శాతాలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో తరగతులన్నింటిలో సీట్ల కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రూరల్ మండల పరిధిలో మొత్తం 77 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 58, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ఉన్నత పాఠశాలలు 14, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాల ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 10,651 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నారు. వీరితో పాటు కొత్తగా అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయి. మూడు రోజుల్లో సుమారు 500మంది వరకు చిన్నారులు ఒకటో తరగతిలో చేరారు. కొందరు విద్యార్థులు ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతి కోసం సమీపంలోని ప్రాథమికోన్నత లేదా ఉన్నత పాఠశాలల్లో చేరుతున్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోరుగా అడ్మిషన్లు నమోదవుతున్నాయి. ఈ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ కడియాల రాజు, హెచ్ఎం గాయత్రి తదితరులు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలోను స్థానిక ప్రజా ప్రతినిధులు పండగ వాతావరణంలో కిట్లు పంపిణీ చేస్తున్నారు. పాఠశాలల ప్రారంభం రోజున తూరంగి స్కూల్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు జగనన్న కిట్లు పంపిణీ లాంఛనంగా ప్రారంభించారు.



ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు

సౌకర్యాలు బాగున్నాయి



ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు బాగున్నాయి. అందుకే ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా మా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చదివిస్తున్నాను. మా పాప రమణయ్యపేట కొత్తూరు బర్మాకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఐదు వరకు చదివింది. 6వ తరగతిలో చేర్పించేందుకు ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చాను. ఇక్కడ నాడు - నేడు ద్వారా అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

– కొప్పిశెట్టి లక్ష్మి, విద్యార్థిని తల్లి, రమణయ్యపేట కొత్తూరు బర్మాకాలనీ

ఇంగ్లిషు మీడియంలో చేరాను



ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న ఇంగ్లిషు మీడియం పెట్టారు. కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలో చదివాను. హైస్కూల్ కోసం ఏపీఎస్పీ జెడ్పీ స్కూల్‌లో చేరాను. ఇక్కడ ఇంగ్లిషు మీడియంలో చదువుతున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు బాగా చెప్తున్నారు.

– పెంకే సురేంద్ర, 6వ తరగతి, పి.వెంకటాపురం

ఘనంగా రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న వైద్య విద్యార్థిని అభినందిస్తున్న వైద్యాధికారులు

కాకినాడ క్రైం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రంగరాయ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, రక్తదానం జరిగాయి. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్‌లో పలువురు వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం ఆర్ఎంసీ ఆవరణలో ఇంచార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో రక్తదానం జరిగింది. సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి మాట్లాడుతూ రక్తదాన ప్రాధాన్యాన్ని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్.సౌజన్య, అధికారుల సమక్షంలో రక్త దాతలతో ప్రతిజ్ఞ చేశారు. 30 నుంచి 80 సార్లు రక్తదానం చేసిన దాతలను ఈ సందర్భంగా అధికారులు అభినందించారు. బుధవారం నాటి రక్తదాన శిబిరంలో 68 మంది వైద్య విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ శారద, డాక్టర్ శ్రీహరిబాబుతో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీవు తప్పులు చేసి మాపై నిందలా?

వనమాడిపై ఎమ్మెల్యే ద్వారంపూడి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: యువతను గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలను చేసి వారి భవిష్యత్‌తో ఆటలాడుకున్న ఘన చరిత్ర టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుదేనని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఉండగా క్షమించరాని తప్పులు చేసి ఆ నిందలన్నీ తమపై వేసే ప్రయత్నం చేస్తున్నారా అని మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డంపింగ్‌యార్డు కేంద్రంగా అక్కడి చెత్తను తరలించే వాహనాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా అవుతున్నాయంటూ వనమాడి చేసిన ఆరోపణలపై ద్వారంపూడి మండిపడ్డారు. కొండబాబు ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో డబ్బుకోసం ఇక్కడ గంజాయి, గుట్కావంటి మత్తు పదార్థాలను ప్రోత్సహించి ఎంతో మంది జీవితాలను నాశనం చేశారన్నారు. చివరకు పోలీసుశాఖలో సీఐ పోస్టుకు రూ.15 లక్షలు చొప్పున వసూళ్లు చేయడంతో సహజంగానే కొండబాబు అక్రమాలను అప్పట్లో అడ్డుకోలేకపోయారన్నారు. స్వతహాగా ఆస్తిపరుడినైన తనకు మాదకద్రవ్యాలను ప్రోత్సహించి సొమ్ములు చేసుకునే అఘాయిత్యం పట్టలేదన్నారు. రెండు రోజుల క్రితం గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఏడుగురిలో ఇద్దరు యువగళం యాత్రలో పాల్గొన్న యువకులని, దాని ఆధారంగా టీడీపీ, వనమాడిపై ఆరోపణలు చేయలేనా అని ద్వారంపూడి ప్రశ్నించారు. మహానేత వైఎస్సార్, సీఎం జగన్ తనకు విలువలు నేర్పారని, తొందరపాటు విమర్శలు చేయడం తనకు తెలియదన్నారు.

అవినీతితో అక్రమాస్తులు

రుణం తీర్చకపోవడంతో ఇంటి జప్తు నోటీసులు కూడా అందుకున్న వనమాడి ఐదేళ్ల ఎమ్మెల్యే పదవీకాలంలో ఉన్న అప్పులు తీర్చి పెద్దపెద్ద భవనాలు కట్టి కోట్లు ఎలా సంపాదించారని ద్వారంపూడి ప్రశ్నించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న వనమాడి అందరూ తనలాగే తప్పులు చేసుస్తారనుకుని అర్థంలేని తప్పుడు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. భూ బదలాయింపుల విషయంలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డ ఆర్డీవో వ్యవహారశైలిని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చెప్పారు. వైఎస్సార్ సీపీ హయాంలో అవినీతిని, తప్పులు చేసే అధికారులను ఏ మాత్రం ఉపేక్షించబోమన్నారు. ఆర్డీవో తీరు తనదృష్టికి వచ్చిన వెంటనే సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకున్నామన్నారు. కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మా శ్రమపై డ్రగ్స్ ముద్రవేస్తారా?

వనమాడి తీరుపై డ్రైవర్ల నిరసన



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాకినాడ: పారిశుద్ధ్య విభాగంలో హూపర్‌టిప్పర్ వాహనాల ద్వారా గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణా జరుగుతోందంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చేసిన ఆరోపణలపై వాహన డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలంటూ ఆయనను డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి స్వయంభు ట్రాన్స్‌పోర్టు వాహన ఇన్‌చార్జ్ నంది సతీష్‌చంద్ర, ఇతర వాహనడ్రైవర్లు మాట్లాడుతూ ఉదయం 5 నుంచి నగరంలో తిరుగుతూ తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే క్రమంలో ఎంతో కష్టపడి శ్రమతో, అంకిత భావంతో పనిచేస్తున్నామని, అటువంటి తమపై వనమాడి వేసే నిందలు వల్ల భవిష్యత్‌లో జీవనోపాధికి విఘాతం కలగడంతో పాటు సమాజంలో డ్రైవర్ల పట్ల చెడు అభిప్రాయం కలిగే పరిస్థితిని కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆరోపణలు చేయడం ద్వారా తమ మనో భావాలను దెబ్బతీయవద్దని మరో ప్రతినిధి ఇస్మాయిల్ పేర్కొన్నారు. వచ్చిన ఆరోపణల్లో వాస్తవాల నిగ్గుతేల్చేందుకు విచారణ జరపాలని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డికి, పోర్టు పోలీసు స్టేషన్‌లోను ఫిర్యాదు చేశారు.

దివ్యాంగుల కల్యాణ వైభవం

- ఒకటైన మూడు జంటలు
- వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి



నూతన జంటలను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మేధస్సులో వారికి మించిన వారుండరు. తెలివితేటలతో ఆకట్టుకునే వారికి భగవంతుడు అందరిలా అవయవాలను సరిగా పెట్టలేదు. ఏదో లోపంతో పుట్టినప్పటికీ సమాజంలో తాము ఎవరికీ తీసిపోమనిపించుకునేలా కష్టపడే శ్రమజీవులు ఆ దివ్యాంగులు. అందరిలా వారూ సంసార జీవితం గడపాలని కోరుకుంటున్నారు. అటువంటి వారికి బాసటగా నిలుస్తూ సామూహికంగా వివాహాలు జరిపిస్తూ తనవంతుగా దివ్యాంగుల సేవలో తరిస్తున్నారు దివ్యాంగుడైన పి.సురేష్‌కుమార్. ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్యను ఏర్పాటు చేసి దివ్యాంగులకు సేవలందించడంతో పాటు యువతీ యువకులైన దిగ్యాంగులను సామూహిక వివాహాలు చేసి జంటలుగా చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం కాకినాడ నగరం రమణయ్యపేట ఒకటో డివిజన్ వినాయక ఫంక్షన్ హాలులో ఘనంగా వివాహాలు జరిపించారు. వేదమంత్రాల నడుమ మూడు జంటలు సుధీర్–ప్రియాంక, శివ–పూర్ణిమదేవి, పోతురాజు–వీరమంగ తాయరు మూడుముళ్ల బంధంతో ఒకటయ్యారు. వీరిలో తుణుకు చెందిన ప్రియాంక దివ్యాంగులు కాగా ఆమెను డెలివరీ బాయ్‌గా పనిచేసే సుధీర్ (దివ్యాంగుడు కాదు) ప్రేమించడంతో ఆశ్రయ వికలాంగుల సమాఖ్య ద్వారా వివాహం జరిపించారు. రాజోలుకు చెందిన శివ, పూర్ణిమదేవి దివ్యాంగులు. అలాగే కరపకు పోతురాజు దివ్యాంగుడు కాగా, మేనకోడులు వీరమంగతాయారు(దివ్యాంగులు కాదు) ఇష్టపడి ముందుకు రావడంతో వివాహం జరిపించారు. నూతన వధూవరులను కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, గవర్నర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని పద్మశ్రీ, సుంకర శివప్రసన్న, ఎస్‌సీఎస్ గ్రూప్ చైర్మన్ మురళీ తదితరులు ఆశీర్వదించారు.

సమాజానికి దిక్సూచి జోతిష్యం

- జోతిష్య పండితుడు సరిపెల్ల
- కాకినాడలో అంతర్జాతీయ సదస్సు



డాక్టర్ సరిపెల్లను సత్కరిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: సమాజానికి జోతిష్యం దిక్సూచి వంటిదని, దీనిని అధికారికంగా ప్రామాణిక శాస్త్రంగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ అంతర్జాతీయ జ్యోతిష్య సదస్సు తీర్మానించింది. ప్రముఖ జోతిష్యపండితులు సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో కాకినాడలో బుధవారం అంతర్జాతీయ జోతిష్య సదస్సు జరిగింది. సైన్స్, సైకాలజీ కోర్సులలానే జోతిష్యాన్ని కూడా పాఠ్యాంశాల్లో మరింతగా అభివృద్ధి చేయాలని జ్యోతిష్య పండితులు కోరారు. ఈ సందర్భంగా పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రాలాజికల్ సైన్సెస్ అధిపతి నాగులపల్లి మహేష్ చందర్ భరద్వాజ్ మాట్లాడుతూ జోతిష్యం విజ్ఞానశాస్త్రమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ప్రభుత్వాలు ఈ శాస్త్రాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. పంచాగకర్త, జోతిష్యవాస్తు ముహూర్త పండితులు డాక్టర్ సరిపెల్ల శ్రీచంద్రమూర్తికి మహామహోపాధ్యాయ పురస్కారం అందించి సత్కరించారు. వింజవరపు జనార్దన్, దీక్షితుల సుబ్రహ్మణ్యం, మేడవరపు సంపత్‌కుమార్, మద్దాలి శ్రీనివాసరావు, చల్లా నిరంజన్ పాల్గొన్నారు.

మార్కెట్‌కమిటీ ఛైర్మన్‌గా పసుపులేటి

- వైస్ ఛైర్మన్, డైరెక్టర్ల నియామకం
- రేపు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు



పసుపులేటి వెంకటలక్ష్మి

కాకినాడ: కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పసుపులేటి వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సిఫార్సు మేరకు చైర్మన్‌గా పసుపులేటి, వైస్ చైర్మన్ ధోణి చిట్టిబాబుతో పాటు ఇతర సభ్యులను కూడా నియమించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన పాత్ర వహిస్తున్న పసుపులేటి వెంకటలక్ష్మి అనేక పదవులను సమర్థంగా నిర్వహించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా, పార్టీ నగర మహిళాధ్యక్షురాలిగా, స్మార్ట్‌సిటీ డైరెక్టర్‌గా, రాష్ట్ర బీసీ కార్పొరేటర్ డైరెక్టర్‌గా కూడా ఆమె పనిచేశారు. కాగా కమిటీ సభ్యులుగా మాకిరెడ్డి పద్మావతి, గంధం మంగాదేవి, పోతాప్రగడ వెంకటరవికుమార్, మోసా సూర్యకుమారి, పాలెపు రవికుమార్, పాడిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు, షేక్ ఖాదర్ మొహిద్దీన్, మద్దాల ఎస్.మూర్తి, మందపల్లి మీరమ్మ, సింహాద్రి కృష్ణకుమారి, ఉంగరాల వెంకటేశ్వరరావు, శంఖ అనంత సత్యవతి అనసూయ, కొట్టాల శివప్రసాద్‌లను సభ్యులుగా నియమించారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పాటు, సభ్యులుగా మార్కెట్ కమిటీ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొంటారు. కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం స్థానిక డి కన్వెన్షన్‌లో జరగనుంది. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీ వంగా గీత, పార్టీ కాకినాడ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

మహాప్రస్థానం డ్రైవర్ తొలగింపు

కాకినాడ క్రైం: జీజీహెచ్ మహాప్రస్థానం వాహన డ్రైవర్ దడాల రామును విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు బుధవారం నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఒక మృతదేహాన్ని తరలించాలని కోరిన బాధిత కుటుంబీకులపై దురుసు ప్రవర్తన, లంచం ఇవ్వలేదన్న అసంతృప్తితో వ్యవహరించిన తీరును అధికారులు తీవ్రంగా పరిగణించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి మహాప్రస్థానం నిర్వహణ సంస్థ ఇంటిగ్రేటెడ్ హెల్త్ గ్రూప్‌నకు ఇచ్చిన తక్షణ ఆదేశాల మేరకు జోనల్ మేనేజర్ గంగరాజు డ్రైవర్ రామును విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మహాప్రస్థానం వాహనాల ద్వారా మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చిందనీ, ఆ ప్రయోజనాలను వారికి అందకుండా వ్యవహరించడం సరికాదని సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి అన్నారు. డ్రైవర్ వ్యవహారశైలిని తీవ్రంగా పరిగణించాలమనీ, ఈ కారణంతోనే చర్యలు చేపట్టామని తెలిపారు. సిబ్బంది ఎవరైనా రోగులు, వారి సహాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించినా, లంచాలు డిమాండ్ చేసినా తక్షణమే సంబంధిత అధికారులు లేదా ఆసుపత్రి ఆర్ఎంవోకు ఫిర్యాదు చేయాలని కోరారు.

వివాద రహితుడు ఎస్వీవీ

- జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి
- సిబ్బంది సత్కారం



సీఈవో సత్యనారాయణను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా ఎస్‌వీవీ సత్యనారాయణ అత్యున్నత బాధ్యతలు నిర్వహించి, ఇటు ఉద్యోగులలో, అటు రాజకీయ వర్గాల్లో వివాద రహితుడిగా పేరు గడించారని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. బుధవారం సత్యనారాయణ విధుల నుంచి రిలీవ్ అయి కాకినాడ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఆయనకు వారంతా ఘనంగా వీడ్కోలు పలికారు. జెడ్పీలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి వారికి ప్రభుత్వపరంగా రావాల్సిన అనేక సమస్యలను పరిష్కరించారన్నారు. తాళ్లరేవు జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరణ

కాకినాడ ఆర్డీఓగా ఎస్‌వీవీ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ సీఈవోగా 2020 అక్టోబర్ 29న నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరిలో విధులు నిర్వహించారు. ఆయనను ఆర్డీవో కార్యాలయం సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటీవ్ అధికారి అబ్బిరెడ్డి రమణారెడ్డి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

పాత్రలకు జీవం పోసిన నటులు




కొత్త పరిమళం నాటికలో ఒక సన్నివేశం

- ఆలోచింప చేసిన అతీతం
- ఆకట్టుకున్న కొత్త పరిమళం

కాకినాడ కల్చరల్: స్థానిక ది యంగ్ మెన్స్ హ్యాపీక్లబ్ దంటు కళాక్షేత్రంలో కాకినాడ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం జ్యోతి వెలిగించి నాటికల ప్రదర్శన ప్రారంభించారు. ముందుగా అభినయ ఆర్ట్స్ (గుంటూరు) సమర్పణలో ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో ప్రదర్శించిన ‘అతీతం’ నాటిక ఆకట్టుకుంది. ఆధునిక యుగంలో మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని రుజువు చేస్తూ నాటిక సాగింది. అనంతరం శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం (బొరువంక) సమర్పణలో బీఎంఎస్ పట్నాయక్ దర్శకతంలో ప్రదర్శించిన ‘కొత్త పరిమళం’ నాటిక రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధంలో సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు తీర్చిదిద్దారు. కార్యక్రమంలో బుద్దాల రామారావు, నాగిరెడ్డి సతీష్, సి.స్టాలిన్, పీవీ రావు, మార్ని జానకిరామ్ చౌదరి, అసోసియేషన్ కన్వీనర్లు ఎన్.ప్రభుదాస్, కృష్ణారావు, తురగా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నాటికల పోటీలలో భాగంగా గురువారం సాయంత్రం ఆరు గంటలకు తెలుగు కళా సమితి (విశాఖపట్టణం) సమర్పణలో చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో ‘నిశ్శబ్దమా నీ ఖరీదెంత?’ నాటిక అనంతరం రసఝరి సంస్థ (పొన్నూరు) సమర్పణలో వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో ‘పక్కింట్లో పుట్టండి’ నాటికలు ప్రదర్శిస్తామని అసోసియేషన్ కన్వీనర్ కృష్ణారావు తెలిపారు.

రక్తదాతలకు సన్మానం



రక్తదాతలను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాతలు పోలిశెట్టి నారయ్య, వేపకాయల శివకుమార్, పి.మణికుమార్, బి.రామకృష్ణ, చంద్రశేఖర్ లను బుధవారం సన్మానించారు. డాక్టర్ బొండా సూర్యారావు, అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, రెడ్డెం రాజా తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు బుద్దరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో కరపత్రాల ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. రేలంగి బాపిరాజు, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ స్మారక వేదిక అధ్యక్షురాలిగా రాయవరపు



రాయవరపు సత్యభామను సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ కల్చరల్: శ్రీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక అధ్యక్షురాలిగా రాయవరపు సత్యభామను ఎన్నుకొన్నారు. స్థానిక సూర్యకళామందిర్ ప్రాంగణంలో వేదిక వ్యవస్థాపక కార్యదర్శి డోకుబుర్ర రామ్‌రాజ్ అధ్యక్షతన బుధవారం ఉదయం సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అంగాడి శివప్రసాద్, పెద్దిరెడ్డి సతీష్, సాగర్ వ్యవహరిస్తారు. ప్రధాన కార్యదర్శిగా డి.రామ్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా ఎం.భాస్కరావు, ఉపాధ్యక్షుడిగా జె.తిరుమలరావు, కోశాధికారిగా కె.సాల్మన్‌రాజును ఎన్నుకొన్నారు. వేదిక అధ్యక్షురాలు రాయవరపు సత్యభామ మాట్లాడుతూ సూర్యకళామందిర్‌లో ఈ నెల 24న ప్రపంచ సంగీత దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. స్వరాగమాల పేరుతో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నామని ఆమె అన్నారు. అనంతరం వేదిక సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు.